
# అగ్గిపెట్టె

## ఇచ్ఛాపురపు రామచంద్రం





గోపాలానికి బస్సుపడదు.

అయినా అతను బస్సెక్కక తప్పలేదు.

రైళ్లకి లేటుబాధ. బస్సులకి రేటు బాధ.

గోపాలం ఎక్కిన సూపర్ ఎక్స్‌ప్రెస్ రేటుకేతప్ప వేగానికీ సుఖానికీ కొంచెమూ సుపర్బ్‌గాలేదు. ఆ డ్రయివరుకి — 'నిదానమే ప్రధానము' — 'వేగము మృత్యువే.' వంటి వాక్యాలలో అచంచలమయిన విశ్వాసం ఉన్నట్లుంది. అంగుళం అంగుళమూ ప్రయాణం చేస్తూంది బస్సు. రోడ్డుమీది ప్రతి గోతినీ కుదుపుగా మార్చి ప్రయాణీకులకి అనుభవాన్నందిస్తూంది. దానితో — గోపాలానికి చిరాకుగా ఉంది. తలనొప్పిగా ఉంది. అతను కళ్లు మూసుకుని — నిద్రపోయేందుకు శాయశక్తులా ప్రయత్నించ సాగాడు. నిద్రలో బస్సు ప్రయాణ కష్టాన్ని దాటెయ్యాలని అతని ఆశ. కాని — కళ్లు మండుతున్నాయితప్ప నిద్రరావడంలేదు.

బస్సెక్కుతూ అతను చాలా జాగ్రత్తలు తీసుకున్నాడు. విండోప్లేస్‌కోసం చూశాడు. అన్నీ ఆక్రమించుకోబడ్డాయి. అప్పుడు— నీటుగా ఉండే మనిషిని వెదకి అతని పక్కన కూర్చున్నాడు. అతనెప్పుడూ అంతే తను నాగరిక యువకుల పక్కన కూర్చోవాలనీ, తన పక్కన నాగరికులు కూర్చోవాలనీ కోరుకుంటాడు. ఆ విషయంలో గోపాలం సఫలుడు కాగలిగాడు. అతని పక్కనున్న శాల్తీ సూటూ బూటూ వేసుకుని — గొప్పవాడిలా ఉన్నాడు. దానితో — గోపాలం తృప్తిగా కూర్చుని కళ్లు మూసుకున్నాడు. ఐదు నిముషాలకే —

"మాష్టారూ!... ప్లీజ్... అగ్గిపెట్టె.."

కళ్లు తెరచి — చిరునవ్వు నవ్వకుండా — అగ్గిపెట్టె అందించాడు ప్యాంటు జేబులోంచి తీసి. గోపాలం షర్టుకి జేబులేదు.

అతను సిగరెట్ వెలిగించుకుని అగ్గిపెట్టె వాపసుచేశాడు.

పావుగంట గడిచింది.

గోపాలానికి నిద్రపడుతుందేమో అన్న ఆశ కలుగుతూంది.

"అగ్గిపెట్టె యివ్వండి —"

డిమాండ్ చేస్తున్నట్లే ఉందతని కంఠం.

అగ్గిపెట్టె యిస్తూ — పరిశీలనగా చూశాడు.

అతను — ఖరీదయిన మనిషే. ఎందుకంటే అతను కాలుస్తున్న సిగరెట్ ఖరీదయిన బ్రాండ్. అతను చెయిన్ స్మోకర్‌లా ఉన్నాడు.

గోపాలానికి కొంచెం కోపం వచ్చింది. ఏమిటీ మనిషి ? ఐదు రూపాయలిచ్చి సిగరెట్ ప్యాకెట్ కొనగలడు కానీ పదిహేను పైసలిచ్చి

అగ్గిపెట్టె కొనడానికెందుకో కక్కుర్తి? సూటూ బూటూ వేసుకుని అగ్గిపుల్ల ముష్టెత్తడానికి సిగ్గెయ్యదు కాబోలు. పెన్నీ వైజ్... పౌండ్ ఫూలిష్. ఆ కోవలో మనిషే యితమూను.

అతను — అగ్గిపెట్టె తిరిగి యిచ్చాక — మళ్ళీ నిద్రాప్రయత్నం చేయసాగాడు.

పావుగంట...

"అగ్గిపెట్టె —"

గోపాలం సహనం నశించింది. కోపం తారస్థాయినందుకుంది. సీటులోంచి లేచి నిలబడి — ప్యాంటు జేబులోంచి అగ్గిపెట్టె తీసి యిచ్చాడు.

అసలే చిరాకుగా ఉన్న అతన్ని — యీ మనిషి మాటిమాటికీ అగ్గిపెట్టె అడగడం మరీ చిరాకు పరచింది. అతనిమీద కోపం తీర్చుకోవాలి. ఎలా? ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాడు. అతను మళ్ళీ అగ్గిపెట్టె అడిగేసరికి — గోపాలం తన ఆలోచన నమలుపెట్టడానికే నిశ్చయించుకున్నాడు. పావుగంట తిరక్కుండానే —

"అగ్గిపెట్టె —" అడిగాడు. జేబులోంచి బయటకు తీశాడేతప్ప గోపాలం యివ్వలేదు. సిగరెట్ తీసి తను అంటించుకుని — వెలుగుతున్న పుల్ల అందించాడు. అలా చేయడంవల్ల తను అగ్గిపుల్లని పూర్తిగా త్యాగం చేయలేదని తృప్తిపడ్డాడు. కాని —

గోపాలం రెగ్యులర్ స్మోకర్ కాదు.

పక్క శాస్త్రిమీద కోపం తీర్చుకుందుకు — పావుగంట కొకటి చొప్పున రెండు మూడు సిగరెట్లు కాల్చేసరికి తనికి పెదవులు మండ సాగాయి. పార్టీల్లోనూ, ప్రయాణాల్లోనూ మాత్రమే కొంచెం కాలుస్తాడతను. అయినా అగ్గిపెట్టె కొంటాడు. ఎవరికోసమో తను సిగరెట్లు ఎక్కువ కాల్చడం తెలివితక్కువగా అనిపించింది. దానితో అతను మరో ఉపాయం కోసం తీవ్రంగా ఆలోచించసాగాడు. సరయిన పద్ధతిలో — అతనికి బుద్ధి చెప్పాలి. తను చెప్పే గుణపాఠం అతని నషాళాని కంటాలి. జన్మలో యిక అతను అగ్గిపుల్లలు ముష్టెత్తకూడదు. ఒక మనిషిని సంస్కరించినా సంస్కరించినట్లే. ఇతన్ని జయించలేకపోతే, వంద కథలు రాసినా రచయితగా తను ఓడిపోయినట్లే.

జిగీష... గోపాలం మెదడుని తినెయ్య సాగింది.

బస్సు ఆగింది.

గోపాలం చకచక దిగి కిందకు వెళ్ళాడు. రెండు నిముషాలయినా గడవలేదు.

సూటువాలా దగ్గరకొచ్చి — "బాబూ, ధర్మం." అంటూ సతాయించడం మొదలుపెట్టాడొక ముష్టివాడు.

గోపాలం సీటులోకి వచ్చి కూర్చున్నాడు.

సూటు వేసుకున్న సీటుమనిషి ముష్టివాడిని సాధ్యమైనంతవరకూ రెపెల్ చేసి — చివరకు ఓడిపోయి ఐదు పైసలు వేశాడు. వాడు తీసుకున్నాడు. కాని — మళ్ళీ — "ధర్మం బాబూ." అంటూ వచ్చాడు.

"ఇప్పుడే కదా వేశాను?" తెల్లబోయాడు సూటువాలా.

అతని మాటలు వినిపించుకోనట్లే... "ఉన్న మారాజులు. ధర్మం చేయండి బాబూ..." పీడిస్తున్నాడు ముష్టివాడు.

"మాటి మాటికీ నన్నే బాధపెడతావేం, వేశానన్నా వినిపించుకోకుండా?" కసురుకుంది సూటు. ముష్టివాడు మాత్రం దూషణ భూషణ తిరస్కారాల కతీతుడినన్నట్లు అతన్ని జిడ్డులా పట్టుకుని వదల్లేదు. నాగరికుడు చాలా అలసిపోయాడు ముష్టివాడితో.

బస్సు కదిలింది.

"ఆ వెధవకి పిచ్చా, వెర్రా?" అడిగాడతను బస్సు కదిలాక గోపాలాన్ని.

"ఏ వెధవకి?"

"ఆ బెగ్గర్..."

నవ్వాడు గోపాలం.

"నవ్వుతారేం?" కోపంగా చూశాడా శాస్త్రి గోపాలం వేపు.

"చిన్న విషయం జ్ఞాపకం వొచ్చి..."

"ఏమిటి?"

"రాష్ట్రంలో ముష్టివాళ్ళని లేకుండా చేస్తానంది ప్రభుత్వం ఆ మధ్య..."

"అనడంమేరకే. ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నిస్తేగా?"

"ఆచరణలో అది అసాధ్యమని తెలుసుకుని ఉంటుంది ప్రభుత్వం."

"అసాధ్యమా! ఎందుకని? సిన్సియర్‌గా ప్రయత్నిస్తే సాధించలేనిదేముంటుంది?"

"ఈ దేశాన్నుంచి...యీ మనుషుల నుంచి ...పేదరికాన్ని పారద్రోలడం సాధ్యం కాదనుకుంటాను."

"ఎందుకని?"

"మీరు క్షమిస్తే ... నిజం చెబుతాను. పదే పదే ముష్టివాడు పైసలడిగినందుకు మీరెంత బాధపడ్డారో అంత బాధా నేను మీకు ప్రతి పావుగంటకీ అగ్గిపెట్టె అందించడాని కనుభవించాను. పొగ త్రాగుట హానికరమన్న చట్టబద్ధమైన హెచ్చరికలాగే అగ్గిపెట్టె అనువడగడం నీచం అని సిగరెట్ పెట్టె మీద ముద్రించినా ఉపయోగం ఉంటుందనుకోను — ఉన్నా — ముష్టెత్తుకోడం మన కలవాటు." చిరాకులోనూ, కోపంలోనూ పరుషంగానే ఉంది గోపాలం కంఠం.

పక్కనున్న శాస్త్రి ముఖం మాడిపోయింది.

"సిగరెట్... అగ్గిపుల్ల ... వక్కపొడి ... ముక్కుపొడుం ... వీటికోసం చేతులు చాచి తీరుతారెందరో. మన రక్తంలోనే ఉందేమో యాచనా నైజం. పుట్టుకతో వచ్చిన బుద్ధి — పుడకలతో కాని పోదంటారు."

అవతలి శాస్త్రి అవాక్కయిపోయాడు.

గోపాలం — అతన్ని అంతటితో క్షమించినట్లు ఊరుకున్నాడు. చిన్న తప్పుకి చాలా పెద్ద — కఠినమైన శిక్ష వేశానేమో! అని అతని కనిపించింది. ★

